# లవ్ టు లివ్

## -కలిదిండి జయ



మనసు, శరీరం రెండూ పూరుకోవడం లేదు. ఒకటే గొడవ శ్యామ కావాలని. చేతిలో వున్న పుస్తకం గిరవాటేసి అటూ ఇటూ పచార్లు చెయ్యడం మొదలు పెట్టాడు. పరీక్షలు ఇంకా రెండు వారాల్లో వున్నాయి. మెదడుకి ఏకాగ్రత వుండికాని, అది శ్యామ మీదే వుంది.

'శ్యామ' అనే అబ్సెషన్ ఈ మనసు నుంచి కొంచెం దూరంగా పోతే బావున్ను. అబ్బా! అలా ఆలోచించడమే! ఎంత క్రూరం! క్షణం శ్యామ గురించి ఆలోచించకుండా బతకడమే ఘోరం, నరకం...

ఇలా చక్రవర్తి ఆలోచనా ప్రవంతి సాగుతుండగానే జగన్ వచ్చాడు. చక్రవర్తి ఆముంగు స్నేహితుడు జగన్.

'ఏరా చక్రీ ఏమిటి కథ' అన్నాడు వస్తూనే—

ప్రతిసారి, వచ్చినప్పుడల్లా అలా అనడం చక్రవర్తి శ్యామ గురించిన సంగతులు, సందేహాలు వల్లించడం జరుగుతోంది.

ఈసారి కూడా —

చక్రవర్తి — "చదువు బుర్రకి ఎక్కడం లేదురా?"

"ఏం మాయరోగం"

"శ్యామ పెద్ద డిస్ట్రాక్షన్ అయిపోయింది."

"అదేవిటిరా కొత్తగా..."

"కాక - మరి. పుస్తకం తెరిస్తే శ్యామ మొహం. ఒక లైను చదవడం మొదలెట్టేసరికి హృదయంలో శ్యామ మాటలు అలల్లా కదులుతూ, గింగి రెత్తుతూ... అబ్బ... అస్సలు ఏదీ ఎక్కని మనఃస్థితిలో వున్నాను."

"ఇంకేం! పుస్తకం ముందెట్టుకుని అవస్థపడడం - వెధవ పుస్తకాలు మూలన పడేసి వెళ్ళి శ్యామల వెనక తిరగక..."

"అబ్బే అలా ఎలా కుదురుతుందిరా. ఈ సంవత్సరం చదువు గట్టెక్కించకపోతే మళ్ళీ వచ్చే సంవత్సరం ఈ చదువు గొడవలో తలమునకలవ్వాల్సిందేగా. అగ్రికల్చర్ డిగ్రీ పూర్తిచెయ్యలేని మగాడు నాకేం అల్లుడు అని శ్యామ బాబు అనుకుంటే? కొంప మునుగుతుంది. అసలే తిక్క ముండాకొడుకు ఆయన."

"మరేం చేద్దామని."

"ఎలాగో మనసు అదుపులో పెట్టుకుని చదవాలనే ప్రయత్నం."

"నీ పరిస్థితి చూస్తుంటే అదంత సులభం కాదని పిస్తోంది."

"మరేం చెయ్యడం?"

"నే నొకటి చెప్పనా?"

చక్రవర్తి మొహంలో ఉత్సుకత—

"చెప్పరా బాబూ చెప్పు."

"నేను చెప్పేది 'ప్రాక్టికల్' కాకపోవచ్చు. 'యూనివర్సల్' కాకపోవచ్చు. కాని నా ఉద్దేశం దేని మీదైనా మనకి భ్రాంతిగా వుంటే - దాన్ని అనుభవిస్తే ఆ భ్రాంతిపోయి మనసుకి కొంత నిశ్చలత వస్తుంది. అలాగే నువ్వు ఆ శ్యామల సొంపుసొంపులు తలుచుకుని ఇక్కడ అవస్థపడకుండా వెళ్ళి ఆమెని శారీరకంగా ఒక్కసారి... చూసిరా. చూసి...రా... అంటే అర్థమయిందిగా" అన్నాడు.

అప్పటికే ఆ ఊహకి చక్రవర్తి మొహం ఎర్రబారింది. గుండె వేగంగా కొట్టుకోవడం, ఒళ్ళు వెచ్చబడడం, మొహం నుంచి వెచ్చని ఆవిర్లు బయటికి రావడం...

"కానీ... కానీ..."

"ఇక టాపిక్ మార్చు. ఈ విషయం గురించి నేను పొడిగించాలనుకోవడం లేదు."

* * *

కాఫీ కప్పులో ప్రళయం సృష్టించి చేతులు దులుపుకు పోయాడు జగన్.

జగన్ వేసిన బీజం చక్రవర్తి తలలో వృక్షమై కూర్చుంది. శ్యామని ఒక్కసారి, ఒకే ఒకసారి తనివితీరా ... తనలో కలిపేసుకుంటే - బహుశా శ్యామ రహస్యం కొంతవరకు తనకు అర్థమైపోవచ్చు. ఏ రహస్యం తనని ఇలా పిచ్చివాడిగా చేస్తోందో ఆ రహస్యం తెలిసిపోతే బుర్ర స్థిరమై చదువు బాగా ఎక్కుతుంది. కానీ శ్యామ అందుకు ఒప్పుకోవద్దూ. డిగ్రీ చేతికి వస్తేగాని శ్యామ అందదు. శ్యామ అందితేగాని డిగ్రీ చేతికి రాదు.

* * *

"శ్యామా..."

"ఊ ...చెప్పు"

"... ..."

"అప్పుడే ఇది పదమూడోసారి నువ్వు నన్ను పలకరించి మౌనంలోకి వెళ్ళిపోవడం. ఏమైంది చక్రీ నీకు..."

"అది కాదు శ్యామా... ఎలా చెప్పాలో తెలీక" అంటూ ఆకాశం వంక చూశాడు. వెన్నెల్ని వెదజల్లుతూ చంద్రుడు కనిపించాడు. నిట్టూర్చి అటు పక్కకి చూశాడు. కొబ్బరి చెట్లు ఆకులు ఆడిస్తూ చల్లగా కదులుతూ కనిపించాయి. నిట్టూర్చి చూపులు మరల్చాడు - నైట్ క్వీన్ పరిమళాలు వెదజల్లుతూ కనిపించింది - చూపులు వాల్చేసరికి - శ్యామ తమలపాకు పాదాలు, నెలవంకల్లాంటి గోరు కొసలు, ఎర్రంచు తెల్లచీర కుచ్చిళ్ళు కనిపించాయి. నిట్టూర్చాడు.

చక్రవర్తి ఈ నిట్టూర్పుల పర్వం చూసి శ్యామల ఆశ్చర్యపోయింది. ఎప్పుడూ ఏదో మాట్లాడుతూ, అవతలివాళ్ళని పట్టించుకోకుండా తన హడావుడిలో తనుండే చక్రవర్తి ఇలా మాట్లాడలేకపోవడం అనేది చూసేసరికి శ్యామలకి ఆశ్చర్యం వేసింది. ఆమె ఆశ్చర్యం - ఆమె వెడల్పాటి కళ్ళల్లో కనిపించింది. శ్యామల అలా కనురెప్పలు ఆర్పుతూ - విచిత్రంగా, ఆశ్చర్యంగా చూడడం చూసి చక్రవర్తి మరింతగా నీళ్ళు నమిలాడు.

"చెప్పు చక్రీ - ఏమిటి?" అని ఎంకరేజ్ చేసింది. ఆమెలో కూడా కుతూహలం పుట్టింది. చక్రవర్తి నీళ్ళు ఎందుకు నములుతున్నాడో తెలుసుకోవాలనిపించింది.

చక్రవర్తి ధైర్యం చేసి విషయం చెప్పెయ్యాలను కున్నాడు — "శ్యామా - నువ్ నన్ను ప్రేమించడం లేదూ."

"కొత్తగా అడుగుతున్నావేమిటి చక్రీ" ఆమెలో ఆశ్చర్యం మరింత హెచ్చింది.

"అలాకాదు. నేనడిగినదానికి జవాబు చెప్పు శ్యామా!"

"ప్రేమిస్తున్నా."

"నా కోసం ఏదైనా చేస్తావు కదూ?"

"నీ కోసం అంటే-"

"అదే...నా మేలుకోరి...బాగుకోరి...అలా అన్న మాట"

"ఓ! చేస్తాను"

"నేను డిగ్రీ పూర్తిచెయ్యడం నీకిష్టమేకదూ"

"ఎవరికిష్టం వుండదు?"

"అలాకాదు. నీకిష్టమా, కాదా చెప్పు"

"చాలా ఇష్టం."

"కానీ నీవల్ల నాకు డిగ్రీ పూర్తవుతుందనే నమ్మకం పోయింది."

"అదేమిటి చక్రీ?"

"అవును! పుస్తకం తెరిస్తే నీ మొహం. లైను చదివితే నీ జ్ఞాపకం."

"నన్నేం చెయ్యమంటావు?"

"నీకు నా మీద నమ్మకం వుంది కదూ"

"వుంది"

"నిన్ను పెళ్ళి చేసుకుంటాననే నమ్మకం"

"వుంది-అయితే"

"అయితే..." అని ఆగి, చక్రవర్తి మళ్ళీ ధైర్యం పోగేసుకుని మొదలెట్టాడు.

"నువ్వు ఒక్కసారి నా కోరిక...శారీరకంగా తీరిస్తే నాకు నీ బాధ, భ్రాంతి పోయి పరీక్షలు రాయగలుగుతాను. డిగ్రీ పూర్తిచెయ్యగలను."

శ్యామల దిగ్గున అతనికేసి చూసి మొహం తిప్పు



ఒంటి మీద పడ్డ చక్రి వంకరచూపుని
ఉత్తరం కత్తితో చీల్చిన శ్యామ కథ

కుంది.

ఆ మాపుకి చక్రవర్తి భయపడ్డాడు. భయపడి "నన్ను అర్థం చేసుకో శ్యామా, నేను నీవాడినే ఎప్పటికీ. కానీ ఈ భ్రాంతి తీరితేగాని డిగ్రీ గట్టెక్కలేని స్థితిలో వున్నాను."

"అంటే నువ్వు నన్ను అలా చేస్తే...నీ భ్రాంతి తీరుతుందా?"

"అవును శ్యామా!" అన్న చక్రవర్తి జవాబు విని ఆమె గిరుక్కున తిరిగి, అతను పిలుస్తున్నా వినకుండా, డాబా దిగి, లోపలికి వెళ్ళి దఢాలున తలుపులు వేసుకుంది.

అక్కడ్నించి, అప్పట్నించి చక్రవర్తి తిప్పలుపడటం మొదలెట్టాడు.

రోజుల తరబడి, గంటల తరబడి, నిముషాల తరబడి ఆలోచించాడు ఎందుకు శ్యామకి అంత కోపం వచ్చిందని. ఆమె ద్వారానే అది తెలుసుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. బహుశా తను అది అయ్యాక పెళ్ళి చేసుకోకుండా మోసం చేస్తాడని భయమా? ఈ ఆలోచన తట్టగానే ఇదే కారణం అనిపించింది. ఘట్టిగా వెంటనే శ్యామకి నంబర్ డయల్ చేశాడు. ఒకో నెంబరు తిప్పుతుంటే గుండె రింగ్ అయింది. 'హలో' శ్యామ గొంతు.

"నేను చక్రిని" అనగానే కమ్యూనికేషన్ కట్ అయింది.

అలా ఇరవై సార్లు చెయ్యడం, కట్ అవడం. ఇరవై ఒకటోసారి "ఏవిటి మిస్టర్ చక్రవర్తీ ఏవిట్ న్యూసెన్స్-పోలీసులకు ఇన్‌ఫార్మ్ చెయ్యమంటావా" ఆమెలో విసుగు.

"నీకు ఎలా చెయ్యాలనిపిస్తే అలా చెయ్యి శ్యామా! కాస్త నా మాట వినిపించుకోవూ?" దీనంగా. ఈ దీనత్వానికి ఆరడుగుల మగాడు యిలా వ్రేలాడబడి పోవడం గమనించి శ్యామలో చిన్న మార్పు.

"పాత గోలేగా..."

"కాని శ్యామా-నువ్వు అపార్థం చేసుకున్నావు" అంటూ మొదలెట్టే అరగంటసేపు తన వాదనని వినిపించాడు.

ఈ వాదన వింటున్నంతసేపు శ్యామ కళ్ళు బుక్ రాక్‌లో వున్న 'ది సెక్సువల్ సైడ్ ఆఫ్ లవ్' మారీన్ గ్రీస్ పుస్తకం మీదే వున్నాయి. చక్రి వాదనలో బలం కనిపించకపోయినా ఆ విషయం ఆమెని కొంతవరకు ఎగ్జైట్ చేసింది. ఎడ్వెంచర్-అదీ సెక్సువల్ ఎడ్వెంచర్ అనే విషయం ఆమెని లోలోపల టికిల్ చేసింది.

'మగాడి వాస్తవ రూపం బెడ్ మీదే కనిపిస్తుంది. ఆ క్షణంలో అంతకు ముందు అతను ముసుగేసుకున్న హిపోక్రసీని వదిలేస్తాడు. బహుశా చక్రి నిజమైన రూపం తను చూడగలడేమో, అంతవరకు అతను కప్పుకున్న ముసుగు తొలగి నిజంగానే అతని నగ్న స్వరూపంలాగా తెలుస్తుంది. సమాజం కోసం, స్వలాభం కోసం వేసే వేషమంతా అక్కడ రంగులు కరిగి అతని క్యారక్టర్ పూర్తిగా కనిపిస్తుంది. ఈ ప్రేమికుడు చక్రి కేవలం తనని మంచి చేసుకోవడానికి, 'వూ' చెయ్యడానికి తన వెనుక తిరుగుతున్నాడు. కాని ఆ ఫైనల్ స్టేజికి



"నీ పేరేంటి పాపా?"
"డాలి"
"అది ఇంట్లో పేరు. స్కూలు పేరు చెప్పు"
"మోడల్ పబ్లిక్ స్కూల్"
- గొల్లపూడి శైలజ

వస్తే ఎలా ప్రవర్తిస్తాడు?' మానసికంగా అతని ఆఫర్‌ని అంగీకరించే స్థితికి ఆమె వచ్చేసింది.

ఇంకా చక్రవర్తి ధారాపాతంగా మాట్లాడుతూనే వున్నాడు.

శ్యామ అతనికి ఫుల్‌స్టాప్ పెడుతూ "సరే చక్రీ. రేపు మధ్యాహ్నం కాలేజీ నుంచి సరాసరి నీ రూమ్‌కి వస్తాను. ఓ.కె." అంది.

చక్రవర్తి క్షణం మూగవాడయ్యాడు. స్తబ్ధుడయ్యాడు. ఆశ్చర్య ఆనందాలవంటి అనేక భావాలు ముప్పేటగా అతన్ని వూపిరి ఆడనియ్యనంతగా వుదయించాయి. ఉప్పెనయ్యాయి. అతను ఆ స్థితిలో వుండగానే శ్యామ ఫోను పెట్టేసింది.

ఆ మధ్యాహ్నం-

ఆ రోజు చక్రవర్తికి ఎలాగో తెల్లారింది. లక్షన్నొకసారి వాచీ వంక చూసుకుంటూ వుండగా మధ్యాహ్నమయింది. ఒకటి ఐదు నిముషాలకి ఆ సందులోకి వస్తూ శ్యామ. పరిగెత్తుకుంటూ ఎదురు వెళ్ళి, ఆకాశంలోకి ఎత్తి గిరగిర తిప్పి, ఆ ఉద్రేక ఉత్సాహాలని చాటుకోవాలనిపించి కూడా, బయట ప్రపంచానికి తమ మధ్యనున్న సంబంధం తెలిస్తే కొంప కూలుతుందని తెలిసి, నిలదొక్కుకుని అలాగే రూము కిటికీ ముందు స్తంభంలా నిల్చుండిపోయాడు. లోపలికి వచ్చిన శ్యామకి తనని అలాగే పట్టి పట్టి చూస్తున్న అతని కళ్ళల్లో మృగం కనిపించింది. ఒక్క సెకను. అతి తెలివిగా ప్రవర్తిస్తున్నా అనుకుంటూ అతి తెలివి తక్కువగా అతని ఇష్టానికి తల ఒంచుతోందా అనిపించింది. ఉప్పెనలా వచ్చి ఆమెని చుట్టేశాడు. అతడ్ని భరించలేక కెవ్వుమంది. కాని చక్రి ఈ లోకంలో లేడు. తన శ్యామ కాలికి చిన్న రాయి తగిలితే గిలగిలలాడిపోయే చక్రి అసలు అక్కడ లేనేలేడు.

ఆ మధ్యాహ్నం గడిచిపోయింది. అలా మధ్యాహ్నం తర్వాత నుంచి చక్రవర్తి ఒక ట్రాన్స్‌లో వున్నట్టున్నాడు.

అయితే జగన్ ఊహించినట్టు చక్రవర్తి ఆలోచనలు చదువు మీద కాన్సంట్రేట్ కాలేదు. సాయంత్రమయ్యేసరికి ఒక నిర్ణయానికి వచ్చేశాడు. ఆరు నూరయినా శ్యామ మళ్ళీ కావాలి. అది శ్యామ ఒప్పుకోకపోతే కిడ్నాప్ చేసి అయినా తన కోరిక తీర్చుకోవాలి అనే వరకు అతని ఆలోచనా ధోరణిలో తెగింపు వచ్చేసింది. ఒప్పుకోకపోవడానికి అసలు శ్యామకి ఆ ఛాయిస్ వుంటే కదా-సపోజ్ ఒకవేళ ఒప్పుకోకపోతే-నువ్వు ఒప్పుకోకపోతే నిన్ను పెళ్ళి చేసుకోను అని బెదిరిస్తే చాలు లొంగుతుంది. అమ్మాయిలకి 'శీలం-పెళ్ళి' అంత దగ్గర లింక్స్!' అతని మొహం మీద నవ్వు రాక్షసంగా అలుముకుంది.

"హలో శ్యామా" గతంలో లాగ ప్రాధేయత, ఆరాధన ఆ గొంతులో లేవు. ధీమా, కరుకుదనం వున్నాయి.

"రేపు మధ్యాహ్నం నా రూముకి రా. నీ కోసం ఎదురు చూస్తుంటాను" అని చెప్పాలని అతను ప్రయత్నిస్తుండగా శ్యామలే అంది-

"నువ్ రేపు మధ్యాహ్నం లా కాలేజీకి రా"

అప్రయత్నంగా ఆ మాట వినగానే అతని నోటి నుంచి సన్నగా ఈల వచ్చింది. 'సో శ్యామకి కూడా ఈ అనుభవం మళ్ళీ మళ్ళీ కావాలనిపిస్తోందన్నమాట!'

** ** **

అతను ట్రిమ్‌గా తయారయి శ్యామ కోసం వెళ్ళాడు. శ్యామల వెయిటింగ్ రూమ్‌లో కూర్చున్న అతని దగ్గరకి వచ్చి, ఒక ఉత్తరం అందించి మరోమాట లేకుండా వెళ్ళిపోయింది. చక్రవర్తి అయోమయుమై పోయాడు శ్యామ ప్రవర్తనకి.

గబగబ లేచి బయటకి వస్తూ ఉత్తరం చదువుకున్నాడు.

పైన ఏ సంబోధన లేకుండా ఉత్తరం మొదలయింది.

**Falling in love brings, a new delight in beauty, new feelings and new longings. With the deepening of that love, I believe sex also takes on a new meaning, uniting all the spiritual and physical yearnings of two people within the act of love.**

నా నమ్మకానికి దెబ్బ కొట్టావు నువ్వు. నేను- నువ్వు ప్రేమించిన, ఆరాధించిన స్త్రీనని ఒక్క క్షణం గుర్తించలేదు. నాకూ ఒక పార్టనర్‌గా ఫీలింగ్స్, ఇమోషన్స్ వుంటాయని నువ్వు వూహించనే లేదు. ఊహించడానికి కనీసం ప్రయత్నమన్నా చెయ్యలేదు. నన్నో లవర్‌గా కాకుండా వేశ్యలా ట్రీట్ చేశావు. నువ్వో ప్రేమికుడిలా కాకుండా విటుడిలా ప్రవర్తించావు. మనం ముందే ఇలా కలుసుకోవడం మంచిదయింది. లేకపోతే పెళ్ళి చేసుకుని వుంటే జీవితాంతం నేనో కామ మృగాన్ని, సెన్సిటివ్‌నెస్, సెన్సిబిలిటీ రెండూ చచ్చిన విటుడ్ని భర్తలా భరించాల్సి వచ్చేది. సున్నితమైన భావాల్ని, భావుకతని పెంచేదిగా ఆర్ట్ ఆఫ్ లవింగ్ వుండాలి తప్ప ఇలా... కాదు. ఇంకెప్పుడూ నా వరకూ రాకు. ప్రేమ నాటకం మొదలెట్టకు."

క్రింద ఎటువంటి సంతకం లేకుండా విషయం ముగిసింది.

అది పూర్తయ్యేసరికి అంచెలంచెలుగా పెరిగిన అతనిలోని కోపం శిఖరాగ్రం చేరుకుంది. ఉత్తరం వుండలా నలిపి రోడ్డు పక్కకి విసిరేసి ఆ 'పేఠ'లోకి మళ్ళాడు. అక్కడ అతను ప్రేమ నాటకం ఆడనవసరం లేదు. ఆడ శరీరాన్ని డబ్బుతో కొనుక్కోవచ్చు.

# విచిత్ర వాస్తవాలు

గోడమీద అలా పాకుతున్న బొద్దింకను చూసో, ఒంటిమీద తారాడుతున్న సాలీడును చూసో విపరీతంగా భయపడిపోయి, కేకలుపెట్టి, అరచి నానా హంగామా చేసే అపర (అ)ధైర్యస్తులంతా క్రిస్టిలావస్‌ను చూసి నేర్చుకోవలసింది ఎంతైనా వుంది.

శ్వాస నందుకోగానే "కెవ్వు" మంటూ ఆమె అమ్మను కౌగిలించుకుని ఈ ప్రపంచం వంక ఆశ్చర్యంగాను, అద్భుతంగాను చూడలేదు. పుట్టిన

## తొమ్మిదేళ్ళకే అరవై ఏడు శస్త్రచికిత్సలు

రెండు సంవత్సరాల వరకు హాస్పిటల్ బెడ్‌నే అమ్మ పొత్తిళ్ళుగా మార్చుకుంది. మొక్కవోని ధైర్య సాహ సాలే ఆమెకు రక్షగా కవచంగా పని చేశాయి.

ఇంతవరకు దాదాపు 67 ఆపరేషన్లు చేయించుకున్న క్రిస్టి లావస్ పుట్టుకతోనే అనేక అవలక్షణాలు కలిగి వుంది. అందరిలా ఆమె హృదయ కోశం ఎడమవైపు లేదు. అన్నవాహికలో సన్నటి రంధ్రం ఏర్పడి వుంది. కుడి ఊపిరితిత్తి సక్రమంగా రూపు దిద్దుకోలేదు. ఒక చెవి అసంపూర్తిగా వుంటే ఇంకొక చెవి అసలు ఏర్పడనే లేదు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే, మూడేళ్ళ వయసులో ఆమె వెన్నెముక వంపు తిరగడం మొదలు పెట్టింది. ఎనిమిది సంవత్సరాల వయసులో అన్న వాహికకు సంబంధించిన ఆపరేషన్ చేయించుకుని, అన్ని అవరోధాలను ఎదుర్కొని విజయకేతనం ఎగుర వేసింది క్రిస్టిలావస్.

యాభై ఏళ్ళ క్రిందట, డగ్లస్ దంపతులకు ఇరవై ఏళ్ళ పాప మొదటి కూతురు అయితే 'క్రిస్టి' చిన్న కూతురు. 'క్రిస్టి' పుట్టగానే ఆమె అన్నవాహిక పైభాగం మూసుకుని పోయినట్టూ, విండ్ పైప్‌లో రెండు రంధ్రాలు వున్నట్టు డాక్టర్లు గ్రహించారు. వెంటనే అక్కడ్నుంచి ఆమెను మరో హాస్పిటల్‌కు తరలించారు. దాదాపు మూడు వారాల వయసు వచ్చే వరకు 'క్రిస్టి'ని కన్నతల్లి సైతం చూడలేదు.

మొట్టమొదటగా చిన్నారి క్రిస్టి కడుపులోకి ఒక ట్యూబ్ పంపించి ఆహారం అందించే ఏర్పాటుచేశారు. గొంతులో వున్న అవకతవకలన్నింటినీ సరిగ్గా రూపుదిద్దుకొని అన్నవాహికని సరిచెయ్యటానికి ప్రయత్నించారు.



ఒకసారి, రెండుసార్లుకాక మొత్తం నాలుగుసార్లు ఆపరేషన్ చేశాక వాళ్ళు విజయం సాధించారు.

ఆ అనుభవాల్ని గుర్తుచేసుకుంటూ క్రిస్టి తల్లి బిందా.. "ప్రతిసారి డాక్టర్లు క్రిస్టిలో ఏదో ఒక లోపం కనిపెట్టేవాళ్ళు. దాంతో మేము పదే పదే హాస్పిటల్‌కి వెళ్ళాల్సి వచ్చేది. గుండె వుండవలసిన స్థానంలో కాకుండా అవ్యవస్థితంగా వున్నప్పటికీ రక్త ప్రసరణ లాంటివన్నీ మామూలుగానే వుండేవి. అయితే, కుడి ఊపిరితిత్తి మాత్రం సరిగ్గా రూపుదిద్దుకోలేదు. అంతేకాక, 'విండ్ పైప్'కి అది ఎటాచ్ చేయబడి వుంది. ఒక చేతికి రెండు బొటనవేళ్ళు వున్నాయి. దాంతో ఒక బొటనవేలిని తొలగించ వలసి వచ్చింది.

ఇవన్నీ ఇలా వుంటే, గొంతులో ఏర్పడిన సన్నటి రంధ్రాలు గొప్ప చిక్కులు తెచ్చిపెట్టాయి. అవి సరిచేస్తే కాని, ఆహారం ఇవ్వడానికి వీలుకాదు.

"ఇన్ని అవరోధాలని, ఆటంకాలని ఎదుర్కొని మరో రెండు నెల్లో రెండేళ్ళు నిండబోతున్న పాపను ఇంటికి తీసుకొచ్చాము. దానితో మా బాధ లన్నీ కొంతవరకు తగ్గాయి. హాస్పిటల్‌లో వున్నప్పుడు వారానికి రెండు సార్లు చూసివచ్చేదాన్ని. ఇంటికి తీసు కొని రావడంతో ఎక్కువ కాలం 'క్రిస్టి' దగ్గర గడపడానికి అవకాశం దొరికింది.

క్రిస్టికి ఎనిమిదేళ్ళ వయసు వచ్చే వరకు ఆమె గొంతుకి సంబంధించిన సమస్య అలా పెరుగుతూ వచ్చింది. "ఎనిమిదేళ్ళ వయసులో చేసిన చివరి ఆపరేషన్‌తో గొంతుకి సంబంధించిన సమస్యలన్నీ తీరిపోయాయి. ఇంతకు ముందులా కాకుండా క్రిస్టి ఇప్పుడు అన్నీ తినగలుగుతోంది" అంటుంది బిందా!

క్రిస్టికి జరిగిన ఆపరేషన్లలో చెవికి జరిగింది చాలా సున్నితమైన ఆపరేషన్. పుట్టుకతోనే క్రిస్టికి కుడిచెవి లేకపోవడం ఒక విశేషం అయితే, వున్న 'ఎడమ చెవి' మూసుకొనిపోయి వుండడం ఇంకొక విశేషం. ఎడమ చెవిని ఆపరేషన్ ద్వారా బాగుచేశాక చెవిలో కర్ణభేరి ఏర్పడింది. ఇప్పుడు క్రిస్టి హియరింగ్ ఎయిడ్ ద్వారా విన గలుగుతోంది.

ఆరేళ్ళ వయసు వచ్చేసరికి క్రిస్టి వెన్నెముక వంపు తిరగడం మొదలు కాసాగింది. దాన్ని సరిచెయ్యడానికి ఆరేళ్ళ వయసులో ఒక సారి, ఎనిమి దేళ్ళ వయసులో మరొకసారి ఆపరేషన్ చేయాల్సి వచ్చింది.

ఈ ఆపరేషన్ల తరువాత కోలుకుంటూ క్రిస్టి కొత్త ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో.. 1987 క్రిస్టమస్‌కి ముందు అవసరైన ఆపద వచ్చి పడింది. ఆమెలో వున్న లోపం కనుక్కోవడానికి దాదాపు వారం రోజులు పట్టింది డాక్టర్లకు. 1987లో ప్రపంచ వ్యాప్తంగా నమోదయిన కేసులలో ఇది అరుదైనది. "మాల్ ఫార్మడ్ బ్లడ్ వెస్సెల్స్" అమాంతం వేగంతో పెరిగిపోసాగాయి క్రిస్టి శరీరంలో.

అదృష్టవశాత్తు ఆపరేషన్‌లో కూడా డాక్టర్లు అద్భుతమైన విజయం సాధించారు.

గడచిన పద్దెనిమిది మాసాలలోనూ క్రిస్టి పన్నెండు నెలల పాటు స్కూలు జీవితాన్ని సాగొస్తుకుంది. "అందమైన స్కూలు జీవితాన్ని కోల్పోవడం క్రిస్టికి బొత్తిగా ఇష్టం లేదు. అందువలన శారీరకంగా ఇంత బలహీనురాలు అయినప్పటికీ మొక్కవోని ధైర్యసాహసాలతో ఆమె తన జీవితాన్ని ఇప్పటి నుంచే తనకిష్టం వచ్చిన రీతిలో తీర్చిదిద్దు కుంటోంది. సైకిల్ తొక్కడం, నాట్యం, గుర్రపు స్వారీ అమితంగా ఇష్టపడే క్రిస్టి చదువులోనూ అసాధారణ ప్రజ్ఞావంతురాలు.

"ఆమె ఎప్పుడు ఆపరేషన్ చేయించుకుని తిరిగివచ్చినా, స్కూలుకు వచ్చి రాగానే అయిపోయిన పాఠాల్ని త్వరగా చదవాలన్న ఉత్సుకత చూపుతుంది" అంటుంది క్రిస్టి చదువుకుంటున్న స్కూలు ప్రధానోపాధ్యాయురాలు మ్యాకాండ్.

క్రిస్టి ధైర్యసాహసాలకు స్పందించిన వివిధ సంస్థలు అనేక బహుమతులు, అవార్డులు ప్రదానం చేశాయి. ఇటీవలనే ఆమె "ది గర్ల్ గైడ్స్ స్టార్ ఆఫ్ మెరిట్" అవార్డు అందుకుంది. టర్నా క్రాస్ అవార్డ్ ఫర్ ఛైల్డ్ ఓవర్ యూత్ సర్విస్, "టి.వి.ఎస్ చిల్డ్రన్ ఆఫ్ కరేజ్" అవార్డు ఆమెకు లభించాయి.

"ఇలా అవార్డులు అందుకోవడం అన్నది ఎవరికైనా గొప్ప అనుభవమే. కాని, నాకు మాత్రం ఇదంతా మామూలే. నేను తరచు హాస్పిటల్‌కి వెళుతూ, వస్తూ వుంటాను. అంతకు మించి నాకేం తెలీదు" అంటుంది క్రిస్టి.